జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..


జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 22-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 569 పేజీలు: 4 వెల : రూ.7

# కేజీబీవీ పోస్టులకు.. పైరవీలు!




**శ్రీకాకుళం, జనవరి 21 (వార్త):** కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం సమగ్ర శిక్ష అధికారులు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. కేజీబీవీల్లో టైప్3 పరిధిలో అటెండర్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, నైట్‌వాచ్ ఉమెన్, స్కావెంజర్ పోస్టులు 11, టైప్4 పరిధిలో చౌకీదార్, హెడ్‌కుక్, సహాయ కుక్ పోస్టులకు సంబంధించి 17 పోస్టులు, ఔట్‌సోర్సింగ్ కింద ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, వార్డెన్, పార్ట్‌టైమ్ టీచర్లు, ఏఎన్ఎంలకు సంబంధించి 29 పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం 57 పోస్టులకు గాను 3799 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకే వెయ్యిమందికి పైగా అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. ఇక టైప్3 పరిధిలో పోస్టులకు 439 దరఖాస్తులు, టైప్ 4 పోస్టులకు 876 దరఖాస్తులు, ఓట్‌సోర్సింగ్ పోస్టులకు 2484 మంది దరఖాస్తు చేసినట్టు సమగ్ర శిక్ష అధికారులు తెలియజేశారు. కాగా, ఈ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రోజు నుంచే బేరసారాలు మొదలయ్యాయి. పోస్టును బట్టి రూ.2లక్షలు నుంచి రూ.3 లక్షలు వరకూ ఇచ్చేందుకు కొందరు బేరసారాలు చేస్తున్నారు. తమకు తెలిసిన నేతలు, అధికారుల ద్వారా పైరవీలు ప్రారంభించారు. ఎమ్మెల్యేల సిఫారసుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎలాగైనా తమ వారికే ఈ పోస్టులు ఇవ్వాలని కొందరు అధికార పార్టీ నేతలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ పోస్టులు ఎప్పుడో అమ్ముడుపోయాయని కొందరు బహిరంగంగా విమర్శలు చేస్తుండడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెరిట్ ప్రకారం పోస్టులు భర్తీ చేయాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా, ఈ పోస్టుల భర్తీ ఏవిధంగా చేయాలన్న దానిపై సమగ్ర శిక్ష అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు ఇంకా రాలేదని తెలిసింది. మెరిట్ ప్రకారం చేస్తారని కొందరు, రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని మరికొందరు చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రాకపోయినప్పటికీ నేతలు మాత్రం తమ వారికి ఈ పోస్టులు వచ్చేలా పైరవీలు చేస్తున్నారు.

* 57 పోస్టులకు 3799 మంది దరఖాస్తులు * ఎమ్మెల్యేల సిఫారసు కోసం దరఖాస్తుదారులు ప్రదక్షిణలు * ఒక్కో పోస్టుకు రూ.2లక్షలుపైనే బేరసారాలు * పోస్టులు అమ్ముడుపోయాయంటూ ప్రచారం * ఆవేదనలో నిరుద్యోగులు

# భక్తుల భద్రతే ముఖ్యం

* రథసప్తమి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
* హోం మంత్రి అనిత * జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమీక్ష



**శ్రీకాకుళం, జనవరి 21 (వార్త):** అరసవల్లి క్షేత్రంలో జరిగే రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భక్తుల భద్రతే ముఖ్యమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఆమె జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రానున్న ఉత్సవాల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఉన్నతాధికారులతో కలిసి ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లను క్రమబద్ధీకరించాలని, ముఖ్యంగా ట్రాఫిక్ మళ్లింపు విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి సూచించారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, పోలీసు, రెవెన్యూ విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే ఉత్సవాలను దిగ్విజయం చేయగలమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకూడదు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అరసవల్లి రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్ద అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి కోడి రామ్మూర్తి స్టేడియం, అరసవల్లి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న తుది ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత కె.ఆర్ స్టేడియాన్ని సందర్శించిన అధికారుల బృందం, అక్కడ ప్రవేశ మార్గం వద్ద సింహద్వారం వెడల్పు తక్కువగా ఉండటాన్ని గమనించారు. వెంటనే అక్కడి మెట్లను తొలగించి, భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరో నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్, ఫైర్ ఇంజిన్లు మైదానం నుంచి నేరుగా మెయిన్ రోడ్డుకు వెళ్లేలా ప్రత్యేక మార్గాన్ని సిద్ధం చేయాలన్నారు. స్టేడియం అంతటా వెలుతురు సరిగ్గా ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని, అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ వైర్లను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. పార్కింగ్ కోసం ఆర్.సి.యం స్కూల్ గ్రౌండ్‌ను కేటాయించాలన్నారు. ఈ నెల 24న జరగనున్న తమన్ సంగీత విభావరికి వేల సంఖ్యలో యువత, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, గ్యాలరీల వద్ద బారికేడ్లను అత్యంత పటిష్టంగా నిర్మించాలని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సూచించారు. తోపులాటలు జరగకుండా ఎంట్రీ, ఎగ్జిట్‌ల వద్ద పోలీసు బందోబస్తును పెంచాలన్నారు. అక్కడి నుంచి అరసవల్లి వెళ్లిన అధికారులు, ఇప్పటికే రూపొందించిన రూట్ మ్యాప్ ఆధారంగా అన్ని సెక్టార్లను కలియతిరిగారు. ప్రత్యేక ప్రవేశ రూ.100, 300, 500 టికెట్ల క్యూలైన్ల ప్రారంభంలోనే స్కానర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టికెట్ లేని వారు పొరపాటున ఆయా లైన్లలోకి ప్రవేశించి ఇబ్బందులు పడకుండా ముందే కట్టడి చేయాలని నిర్ణయించారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట్ల భక్తులను ఇతర మార్గాలకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. క్యూలైన్ల మధ్య బారికేడ్లు ఎక్కడా ఇబ్బంది లేకుండా, భక్తుల ఒత్తిడికి తట్టుకునేలా పటిష్టంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్, ఆర్ అండ్ బి, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వైసీపీకి షాక్

* తమ్మినేని ప్రధాన అనుచరుడు రమేష్ పార్టీకి రాజీనామా
* త్వరలో భవిష్యత్ ప్రకటిస్తానని రమేష్ వెల్లడి

**శ్రీకాకుళం, జనవరి 21 (వార్త):** పొందూరు మండలం తోలాపికి చెందిన వైసీపీ నేత పప్పల రమేష్ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడికి, పార్టీ అధిష్టానానికి పంపించారు. ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జీ మార్పు, ఏకపక్ష నిర్ణయాల వల్ల తాను పార్టీని వీడాల్సివచ్చిందని రమేష్ బుధవారం మీడియాకు వివరించారు. ఆయన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ప్రధాన అనుచరుడు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు పాటు పార్టీ పొందూరు మండల అధ్యక్షుడిగా వ్యవహరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఆయన పార్టీని వీడడం పట్ల గట్టి దెబ్బ తగిలినట్టు ఆ పార్టీలోకి చెందిన కొందరు చెబుతున్నారు. త్వరలో ఏ పార్టీలో చేరుతానన్నది తెలియజేస్తానని రమేష్ ప్రకటించారు.

# 23న అరసవల్లి శోభాయాత్ర

* 56 రకాల కళారూపాలతో అట్టహాసంగా వేడుక
* కేఆర్ స్టేడియం నుంచి ఆలయం వరకు ఆధ్యాత్మిక శోభ



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** అరసవల్లి రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న నిర్వహించనున్న శోభాయాత్ర భక్తులకు కనువిందు చేయనుంది. కేరళ డ్రమ్స్ నుంచి అఘోరాల విన్యాసాల వరకు మొత్తం 56 రకాల సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాలతో నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కేఆర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర అరసవల్లి క్షేత్రం వరకు వైభవంగా సాగనుంది. శోభాయాత్రలో రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన సింహాచలం, అన్నవరం, ద్వారక తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం వంటి ఆలయాల నమూనా శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. యాత్ర ఆరంభంలో మంగళవాయిద్యాలు, శంఖారావం, సూర్యరథం ముందు నడవగా.. వాటి వెనుక వరుసగా గిరిజన ధింసా నృత్యం, తప్పెటగుళ్లు, పులివేషాలు, కొమ్ముకోయ ప్రదర్శనలు సందడి చేయనున్నాయి. ఫిషర్మెన్, టూరిజం, డి.ఆర్.డి.ఎ వంటి ప్రభుత్వ శాఖల శకటాలతో పాటు హరిదాసుల బుర్రకథలు, మహిళల కర్రసాము విన్యాసాలు యాత్రకు అదనపు హంగులు చేకూర్చనున్నాయి.

## యాత్ర సాగే మార్గం ఇదే..

ఈ మెగా శోభాయాత్ర కేఆర్ స్టేడియం నుంచి మొదలై అంబేద్కర్ విగ్రహం, డే-నైట్ జంక్షన్, కృష్ణా పార్క్, ఏడు రోడ్ల జంక్షన్, సూర్యమహల్ జంక్షన్, గర్ల్స్ హైస్కూల్, మిల్ జంక్షన్ మీదుగా అరసవల్లి ఆలయానికి చేరుకుంటుంది. మార్గమధ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అఘోరాలు, బుట్టబొమ్మలు, తీన్మార్ నృత్యాలు, చెక్కభజనలు వంటి విలక్షణమైన ప్రదర్శనలతో నగర వీధులు ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుకోనున్నాయి.

## సిక్కోలు డ్వాక్రా బజార్ సందర్శన

రథసప్తమి వేడుకలు సందర్భంగా కోడి రామమూర్తి స్టేడియంలో ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజార్‌ను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కుటుంబ సభ్యులతో బుధవారం సందర్శించారు. నాబార్డ్, డిఆర్డిఏ వివిధ రకాల చేనేత మరియు హస్తకళల స్టాల్స్‌ను ఏర్పాటు చేసినందుకు కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట నాబార్డ్ ఏజిఎ రమేష్ కృష్ణ, ఎల్డీయం శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## మందసలో రేపు ఒడియా ప్రత్యేక సామూహిక అక్షరాభ్యాసం

**మందస, జనవరి 21(వార్త):** ఒడియా భాషను అభివృద్ధికై ఈ నెల 23న సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మందస ఎంఈఓ ఎం. లక్ష్మణరావు చెప్పారు. ఈ మేరకు అపోటా మండల కమిటీ నాయకులు ఎంఈఓకు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒడియా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా భాషను అభివృద్ధికి ఒడియా సంస్కృతి సంప్రదాయాలకు ఒడియా విద్య ఎంతో దోహదపడుతుందని, ప్రతి ఒక్క ఒడియా ఉపాధ్యాయులు కృషి చేయాలని మందస మండలం లో పనిచేస్తున్న ఒడియా ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు శ్రీ పంచమి సందర్భంగా నిర్వహించే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి కి ఆహ్వానం పలుకుతూ అపోటా మండల కమిటీ సభ్యులైన జయరాం మాలి, కృష్ణచంద్ర మహంతి, శంకరమహారాణా, ప్రియాంకమహారాణా, విజయ్ కుమార్ పాణిగ్రహి, మంజులమహారాణా తదితర ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణరావుకు ప్రత్యేక ఆహ్వానం పలికారు.



## పలు కుటుంబాలను పరామర్శించిన శిరీష



**మందస, జనవరి 21(వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మందస మండలంలో బుధవారం పర్యటించారు. తాళ్లగురంటికి చెందిన పాండవ రఘు మోని, అంబుగాం- బొడ్డులూరు గ్రామానికి చెందిన బత్తిన కృష్ణారావు, బేతాళపురం గ్రామానికి చెందిన సొడిపెల్లి రాజేష్ కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబా లను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఆమె వెంట తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, ముఖ్య నాయకులు ఉన్నారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**జి.సిగడాం, జనవరి 21(వార్త):** పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేస్తున్నామని, పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొవాలని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ అధికారి సత్యప్రకాష్, మండల పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్ తెలిపారు. బుధవారం బాతువలో ఉచిత పశువైద్య శిబిరం, లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని సర్పంచ్ డబ్బాడ కళ్యాణి, ఎంపీటీసీ బూటు అప్పారావు, ప్రారంభించారు. దీనిలో భాగంగా పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తూ. పలు జీవాలకు టీకాలు, వ్యాక్సిన్లు వేశారు.ఈ శిబిరాల్లో పశు వైద్యులతో ఉచిత వైద్యంతో పాటు తేలికపాటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఎదకు రాని, చూలు కట్టని పశువుల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేస్తారన్నారు. గొర్రెలకు ఉచితంగా బొబ్బ వ్యాధి నివారణ టీకాలు అందిస్తామని పేర్కొన్నారుమేకలకు నట్టల నివారణ మందును అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి డబ్బాడ అదినారాయణ, పశు వైద్యులు హేమంత్ కుమార్, పశువైద్య సహాయకలు బోడ్డేపల్లి సతీష్ , ప్రసాద్, సచివాలయ సహాయకులు ప్రియాంక, సంధ్య, గౌరీ, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**నరసన్నపేట, జనవరి 21(వార్త):** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీం క్లబ్ కోఆర్డినేటర్ కె. గోవిందరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం బాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగం వల్ల శారీరకంగా, మానసికంగా, సామాజికంగా కలిగే నష్టాలను వివరించారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం లేదా అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినట్లయితే 1972 నంబర్?కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైల్వే కౌంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



**పలాస, జనవరి 21(వార్త):** పలాస రైల్వే స్టేషన్ బుకింగ్ కౌంటర్ల వద్ద బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్పి హెడ్ కానిస్టేబుల్ మెట్ట సోమేశ్వం రావు తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు మృతునికి 65 నుండి 70 ఏళ్ళ వయసు ఉంటుందని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జిఆర్పి స్టేషన్‌లో లేక 9492250069కి సమాచారం తెలపాలని కోరారు . మృతుడికి పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని జిఆర్పిఎఫ్ పోలీసులు తెలిపారు.

## ఘనంగా సాయి హోమం పూజలు

**జి.సిగడాం, జనవరి 21(వార్త):** ఆనందపురం గ్రామంలో బుధవారం అంగరంగ వైభవంగా షిర్డీ సాయిబాబా హోమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 100 అడుగుల ఎత్తు నున్న వెంకటి సాయికోటి మహాస్థూపం వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు హోమం జరిపారు. 3వ రోజు బాబా వారికి ప్రత్యేకంగా 'అలంకరించారు. ఈనెల తేది. 26 న అంగరంగ వైభంగా సాయి నామాలను స్మరిస్తూ ఆనందపురంలో ఆధ్యాత్మికం నెలకొంటుందని ఆలయ ధర్మకర్త మక్క వెంకటిసాయి తెలిపారు.





# జనసేన కార్యాచరణ షురూ..!

- -పాతపట్నం నియోజకవర్గంలో వేగం పెంచిన ఆ పార్టీ
- -కొరికానకు వినతుల వెల్లువ
- -ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : రవికుమార్





**కొత్తూరు, జనవరి 21(వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీ తన రాజకీయ కార్యకలాపాలను వేగవంతం చేసింది. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ నియోజకవర్గంలో చురుకుగా ముందుకు సాగుతున్నారు. బుధవారం కొత్తూరులో జనసేన పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం నియోజకవర్గ రాజకీయాల్లో కీలకంగా మారింది. సమావేశంలో భాగంగా, నియోజకవర్గంలోని పలు మండలాల్లో నెలకొన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొందరు టీడీపీ నాయకులు సుడా చైర్మన్ కొరికాన రవికుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరుకు ఇది నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా కొరికాన రవికుమార్ మాట్లాడుతూ, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ వెన్నుముకలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, ఉత్సాహంగా ముందుకు వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండలానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను జనసేన నాయకులు, ప్రజా ప్రతినిధులు రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. మండలానికి మంజూరైన డిగ్రీ కళాశాల ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంపై జనసేన నాయకులు సారిపల్లి వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు సరైన క్రీడా మైదానం లేకపోవడం, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల కొరత వంటి అంశాలను వివరించారు. అలాగే కొత్తూరు ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ లేకపోవడం వల్ల రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని, వెంటనే మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని ఇసాయి వెంకటేష్ కోరారు. గొట్టిపల్లి పంచాయతీ పరిధిలోని సమస్యలపై ఆ గ్రామ సర్పంచ్ నిమ్మక రామకృష్ణ సుడా చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ప్రస్తావించిన ప్రతి సమస్యను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని కొరికాన రవికుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల అధ్యక్షులు జయరాజ్, ఏఎంసీ డైరెక్టర్ అడపాక అశోక్ కుమార్, సారిపల్లి ప్రసాదరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, చోడవరపు సింహాచలం తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం సహాయనిధి

### - ఎమ్మెల్యే డాక్టర్ అశోక్



**సోంపేట జనవరి 21(వార్త):** పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో పెద్ద మొత్తంలో ఖర్చులు చేసిన బడుగు వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. సోంపేట మండలం రామయ్యపట్నం గ్రామానికి చెందిన ఎన్ కృష్ణవేణి అనే మహిళ అనారోగ్యంతో సస్త్ర చికిత్స చేసుకుంటూ ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో ఆమెకు సీఎం సహాయ నిధి నుంచి 25వేల 500 రూపాయల సహాయాన్ని చెక్కు రూపంలో బుధవారం అందజేశారు. ఇటువంటి కోట్లాది రూపాయల సహాయానికి ఏమాత్రం వెనుకడుగు వేయకుండా కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నిట్ట గోపాల్, మద్దు రాజారావు, తెప్పల కోదండరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈనారీతో మహిళా సంఘాలకు నూతనోత్తేజం






**మందస, జనవరి 21(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల అభ్యున్నతికి గ్రామీణ ప్రాంతంలో ఈనారీ సీఆర్పీలను గుర్తించి.. శిక్షణ అనంతరం గ్రామ సంఘాలలో తమకు కేటాయించిన అన్ని సంఘాలకు అవగాహన కల్పిస్తూ నూతన ఉత్తేజాన్ని తీసుకురావాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు పిలుపునిచ్చారు. మండల మహిళా సమాఖ్యలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంస్థల ఏర్పాటు, వాటి సామర్థ్యాల పెంపునకు అవసరమైన శిక్షణలు, సభ్యుల జీవనోపాదులకు అవసరమైన రుణ పరపతి సౌకర్యాన్ని కల్పించి, వారి కుటుంబ ఆదాయాలను పెంపొందించుటకు ఉపయోగపడిందన్నారు. సమావేశాల నిర్వహణ, పుస్తక నిర్వహణ, తీసుకున్న రుణాలను సద్వినియోగ పరుచుకోవడం, ఆదాయాభివృద్ధికి కావలసిన ఆస్తులను కొనుక్కోవడం తదితర బాధ్యతలును ప్రతీ మహిళ నెరవేర్చుకొని, సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ప్రతీ మహిళ సామాజికంగా, ఆర్థికంగా, అభివృద్ధి చెందడానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించి మహిళా సంఘ సభ్యులు ఆదాయం పెంపొందించుకోవడంతో పాటు సామాజిక అవసరాలైన విద్య, వైద్యం, న్యూట్రిషన్, శానిటేషన్ తదితర అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు, మండల సమాఖ్య ప్రతినిధులు రవణమ్మ, శారదతో పాటు లీగల్ కోఆర్డినేటర్ తారకమోహన్, అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారి, కంప్యూటర్ ఆపరేటర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### - జూనియర్ సివిల్ జడ్జి మాధురి

**పలాస, జనవరి 21(వార్త):** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్చి 14న జరగబోయే మొదటి జాతీయ లోక్ అదాలత్ ను పలాస మండల సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి యు. మాధురి చూసుకోవాలని కోరారు. న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పోలీస్ అధికారులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను గుర్తించి అందులో గల కక్షిదారులకు నోటీసులు ఇవ్వాలని, అదే విధంగా న్యాయవాదులు అందరూ రాజీ పడదగ కేసులను గుర్తించి మార్చి నెలలో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి తమ సహకారం అందించాలని, ఈ అవకాశాన్ని కాక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జ్ యు. మాధురి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.రాజరత్నం, తాండ్ర మురళీమోహన రావు, ఎన్ .విశ్వేశ్వరరావు, జిఎంఎస్ అనిల్ రాజు, చంద్రశేఖర రావు, కోత రజనికుమార్, బి. రవికుమార్, జి.ప్రభాకర్‌రావు, వి.రవి, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, కోటేష్, కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జాదుయ్ పిటార కిట్ల పంపిణీ



**నరసన్నపేట, జనవరి 21(వార్త):** నరసన్నపేట మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు సులభంగా, ఆసక్తికరంగా బోధన అందించేందుకు జాదుయ్ పిటార కిట్లను పంపిణీ చేశారు. కథలు, బొమ్మలు, సంగీత వాయిద్యాల ద్వారా బోధన అందిస్తే పిల్లలు త్వరగా అర్థం చేసుకుంటారనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ శాంతారావు పాఠశాలల హెచ్?ఎంలకు ఈ కిట్లను అందజేశారు. ఇటీవల ఉపాధ్యాయులకు నిర్వహించిన జీఎఫ్?ఎల్?ఎన్ శిక్షణ శాతం వందకు వంద విజయవంతం కావడానికి ఉపయోగపడేలా ఈ టీచింగ్ లెర్నింగ్ ఎక్విప్?మెంట్స్?ను అందించినట్లు తెలిపారు. ఈ కిట్లు తరగతి గదుల్లో వినియోగిస్తే విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి అభ్యాస ఫలితాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

## నేడు బిన్నలలో ఎమ్మెల్యే శిరీష పర్యటన



**మందస, జనవరి 21(వార్త):** పలాస నియోజకవర్గ శాసనసభ్యు రాలు గౌతు శిరీషా ఈ నెల 23న మందస మండలంలోని బిన్నలమదనా పురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని మందస పశు వైద్యా ధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పశు గణాభివృద్ధి సౌజన్యంతో బిన్నలలో నిర్వహించే ఫెర్టిలిటీ క్యాంప్, కాల్ఫ్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


## రహదారులకు అధిక ప్రాధాన్యం



**కంచిలి, జనవరి 21(వార్త):** కంచిలి మండలంలో గ్రామీణ రహదారులను పక్కాగా అభివృద్ధి చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు మాదిన రామారావు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మండలంలో ప్రతి గ్రామానికి మంచి రహదారి కల్పించాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. పెంచల మండలం మందపల్లి పంచాయతీ ఒరియా నారాయణపురం నుంచి తలపంపర వరకు తారు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కృషి కూటమి ప్రభుత్వం ఆశయం మేరకు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గత ఐదేళ్లు ఎటువంటి అభివృద్ధి లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒకవైపు సంక్షేమానికి మరోవైపు అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్ పాడి, పూర్ణచంద్ర, అశోక్, జ్ఞాన రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**సంతబొమ్మాళి, జనవరి 21(వార్త):** సంతబొమ్మాళిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ లో కీమాన్ గా పని చేస్తున్న గిన్ని రాజు డ్యూటీ నిమిత్తం కోటపాడు నుంచి ద్విచక్ర వాహనం మీద బుధవారం బయలుదేరారు. సంతబొమ్మాళి ఉమాపాలేశ్వర స్వామి ఆలయం సమీపంలో సెప్టి క్లీన్ ట్యాంకర్ రిపేర్ వలన రోడ్డుపై ఆగి ఉంది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం మీద వస్తున్న గిన్ని రాజు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఆగిఉన్న సెప్టిక్ ట్యాంక్ కు వెనుక నుంచి ఢీకొట్టడంతో చిన్న చిన్న గాయాలు వెంటనే108 వాహనంలో చికిత్స నిమిత్తం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# భూ సమస్యపై రెవెన్యూ సర్వే

**సోంపేట జనవరి 21(వార్త):** ఎర్రముక్కాం గ్రామ సమీపంలో గల సముద్ర తీరానికి ఆనుకొని ఉన్న కదంబాలసుందర్రావుకు చెందిన భూమి స్వభావం తెలియజేయాలని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో ఆయన చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం తాసిల్దార్ అప్పలస్వామి మండల సర్వేయర్ నాగేశ్వరరావు ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. సదరు భూమి జిరాయి తీయ లేక బిడిఆర్ హెల్త్ ఎందుకు సంబంధిత రికార్డులతో అధికారులు హాజరయ్యారు. దీనికి సంబంధించి తహసిల్దార్ అప్పలస్వామి మాట్లాడుతూ ఫిర్యాదు పై ఎక్కడికి వచ్చి సదరు భూమిని సర్వే చేయడం జరిగిందని రికార్డులు కూడా పరిశీలించడం జరిగిందని దీనిపై జిల్లా కలెక్టర్కు నివేదిక అందజేస్తామన్నారు



# శభాష్ లోకేష్..!

## -అంగవైకల్యాన్ని అధిగమించి జాతీయ పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన రెంటికోట కుర్రాడు

## - అభినందించిన ఎమ్మెల్యే శిరీష ప్రశంస




**పలాస, జనవరి 21 (వార్త):** అంగవైకల్యాన్ని అధికమించి జాతీయ, పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభను చూపిన అంతర్జాతీయ క్రీడకారుని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై తన సత్తా చాటాడు పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన లోకేశ్. ఆయనకు పుట్టుకతోనే అంగవైకల్యం. ఇటీవల దుబాయ్‌లో రిగిన ఆసియన్ యూత్ పారా అథ్లెటిక్స్ సిల్వర్ మెడల్ సాధించారు. ఇప్పటికే ఆయన 3 జాతీయ, 4 అంతర్జాతీయ పథకాలను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగవైకల్యాన్ని అధిగమించి జాతీయ, అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ ప్రదర్శించిన పలాస చెందిన మంత్రా లోకేష్‌ని ప్రత్యేకంగా కొనియాడారు. పుట్టుకతోనే ఒక కాలు అంగవైకల్యంతో బాధపడిన ఈ యువకుడు దృఢ సంకల్పంతో క్రీడలో రాణిస్తున్నాడని, అతని ప్రయాణం స్థానిక సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తోందని ఆమె తెలిపారు. 2024 డిసెంబరులో థాయ్‌లాండ్ యూత్ వాల్ గేమ్స్‌లో హై జంప్‌లో గోల్డ్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నాడని అన్నారు. 2025లో దుబాయ్ వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడని వివరించారు. తల్లిదండ్రులను మంత్ర వెంకట్, విజయలక్ష్మిలను అభినందించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన శిరీష



**పలాస, జనవరి 21(వార్త):** పలాస నియోజకవర్గంలో ఇటీవల కాలంలోమరణించిన పలాస మండలం కైజోల గ్రామం తెప్పల ఆడవమ్మ, వజ్రపు కొత్తూరు మండలం కొత్తపేట గ్రామం గుంట లక్ష్మమ్మ , సూరాడ యోగేశ్వరరావు, ఉద్దాన గోపినాథపురం కర్ని వరలక్ష్మి, రియ్యిపాడు గ్రామం సోళ్ళ అమ్మన్న వారి యొక్క కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. పలాస ఎమ్మెల్యే గౌతు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. మృతులు చెందిన వారంతా తెలుగుదేశం పార్టీకి విధేయులుగా ఉండేవరని తెలిపారు. మృతుల కుటుంబాలను పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఎలాంటి కష్టమైనా తనను నేరుగా సంప్రదిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈమెతో పాటు పలాస పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, ఆయా మండలాల కూటమి నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



**పలాస, జనవరి 21(వార్త):** ఉగాది నాటికి వివిధ దశలలో అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు ఒక పత్రికా ప్రకటనలో బుధవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం వివిధ కేటగిరీలకు అదనపు ఆర్థిక సహాయం క్రింద ఎస్ సి వారికి రూ.50,000, ఎస్ టి వారికి 75,000, బిసి వారికి 50,000, ఆదివాసీ గిరిజనులకు రూ.100,000 అందించడం జరుగుతుందని వివరించారు . ఇల్లు లేని పేదవారిని గుర్తించి ప్రధానమంత్రి ఆవాస యోజన క్రింద ఇళ్లులేని పేదవారికి ఇల్లు పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇచ్చిన అదనపు సహాయం సద్వినియోగం చేసుకొని ఉగాది నాటికి మీ ఇల్లు నిర్మాణాలు పూర్తి చేసి పేదవాడి సంతోంటికలను నెరవేర్చు కోవాలని విజ్ఞప్తి చేశారు.

# సారవకోటలో పట్టపగలే దొంగతనం

## -ఒంటరిగా ఉన్న మహిళను కట్టేసి బంగారం అపహరణ



**సారవకోట, జనవరి 21(వార్త):** బద్రిలో పట్టపగలే దొంగతనం చోటుచేసుకుంది. లావేటి పావని ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్క్ ధరించి ఇంట్లోకి చొరబడ్డారు. ఆమెను చున్నీతో చేతులు, కాళ్లు కట్టివేసి దొంగతనానికి పాల్పడ్డారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనలో సుమారు మూడు తులాల బంగారం అపహరణకు గురైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై అనిల్ సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్?తో కలిసి పరిశీలించారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పట్టపగలే జరిగిన ఈ దొంగతనంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

# రాష్ట్ర స్థాయి ఉత్తమ పాఠశాలగా ..

# జలుమూరు ఆదర్శ పాఠశాల



**జలుమూరు, జనవరి 21(వార్త):** రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన స్వచ్ఛ హరిత పాఠశాలలు ఎంపికలో జలుమూరులోని ఆదర్శ మోడల్ స్కూల్ జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికై ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ విషయాన్ని ఉపాధ్యాయుడు మెండ రామారావు మంగళవారం రాత్రి జలుమూరులో వెల్లడించారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, హరిత కార్యక్రమాల అమలు, విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడంలో పాఠశాల చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించిందని తెలిపారు. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి హాజరుకావాలని అధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులకు గర్వకారణమని అన్నారు. పాఠశాల సాధించిన ఈ ఘనతపై గ్రామ ప్రజలు, విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**మందస, జనవరి 21(వార్త):** ఉచిత పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి కోరారు. మందస మండలంలోని రాంపురం, బహాడపల్లి సచివాలయాల పరిధిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం పాడి రైతులు, పశు యజమానులకు ప్రత్యేకంగా ఈ శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. రాంపురం, బహడపల్లి సచివాలయాల పరిధిలో జరిగిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు కార్యక్రమంలో రెండు సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలలో వ్యాధినిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించడం జరిగింది. పాడి రైతులకు పశు పోషణ లో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, పశుబీమా, పశుగ్రాసాల సాగు తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ధర్మేంద్ర, ప్రసన్న, రవి, కళ్యాణ్, ఇంతియాజు, మురళి, నిత్యానందం, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమ, మాసయ్య, సురేష్, విజయానంద్, శ్రావణితో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే గోవింద



**పాతపట్నం/హిరమండలం/ఎల్ఎన్ పేట, జనవరి 21(వార్త):** పాతపట్నంకు చెందిన కొండల వరహాలమ్మ, కొరసవాడ గ్రామానికి చెందిన పూతి చంద్రభూషణ్ మాస్టారు, హిరమండలం మండలం కల్లట గ్రామానికి చెందిన గిరడ రామారావు, కిట్ట లపాడు గ్రామానికి చెందిన బిర్లంగి కోటేశ్వరరావు, గొర్లె పగడాలమ్మ, హిరమండలం మేజర్ పంచాయతీకి చెందిన చోడి సింహాచలం, ఎల్.యన్.పేట మండలం యంబ రాం గ్రామానికి చెందిన పల్లి ఆదమ్మ, వెలమల సన్యాసి, కిలారి కృష్ణారావు, శ్యామలా పురం గ్రామానికి చెందిన మజ్జి లచ్చమ్మ ఇటీవల మరణించిన విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబసభ్యులను పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు . ఎమ్మెల్యేతో పాటు పాతపట్నం, హిరమండలం, ఎల్ ఎన్ పేట మండలాల నాయకులు ఉన్నారు.

# దిబ్బలమారవాడ బీచ్-మంకినమ్మ ఆలయం వరకు..

# విద్యుత్ సౌకర్యం





**సంతబొమ్మాళి, జనవరి 21(వార్త):** మరువాడ పంచాయతీ పరిధిలోని దిబ్బలమారవాడ బీచ్ నుంచి శ్రీ మంకినమ్మ తల్లి గుడి వరకు కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి, ఎల్‌టీ కేబుల్ లైన్ పనులను తాజాగా పూర్తిచేశారు. స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను మురువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు దృష్టికి తీసుకెళ్లి వివరించారు. మంత్రి ఆదేశాలతో విద్యుత్ శాఖ స్పందించగా, సంతబొమ్మాలి మండల విద్యుత్ శాఖ ఏఈ శశిభూషణ్ రావు కొత్తగా విద్యుత్ లైన్ వేసేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి, సిబ్బందిచే సత్వరమే పనులు చేపట్టించారు. దీంతో బీచ్ నుంచి ఆలయం వరకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.ఈ విద్యుత్ సౌకర్యాలతో భక్తులు, స్థానిక ప్రజలకు భద్రతతో పాటు సౌకర్యాలు మరింత మెరుగవుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు, జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ గంట లోకేష్, మేఘవరం నీటి సంఘం ఉపాధ్యక్షులు మేరుగు నూకయ్య, మాజీ సర్పంచ్ సూరాడ కోర్లయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడే ముద్దు



**నరసన్నపేట, జనవరి 21(వార్త):** వీఎన్ పురం జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వీఎన్ పురం పాఠశాల పరిసర గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యా సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫార్ములు తదితర సౌకర్యాలను వివరించారు. అలాగే ఈ నెల 23న వసంత పంచమి సందర్భంగా పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మానవాళి నాగరికతకు చేనేతతోనే శ్రీకారం
- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు
- కాగువాడలో ఉత్తరాంధ్ర చేనేత చైతన్య సభ

**పాతపట్నం, జనవరి 21(వార్త):** చేనేత కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కాగువాడ గ్రామం వస్త్రపురి కాలనీలో బుధవారం జరిగిన ఉత్తరాంధ్ర చేనేత చైతన్యసభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో శతశాతం అమలు చేస్తున్నామని తెలిపారు. మానవాళి నాగరికతకు ప్రామాణికంగా చేనేతపరిశ్రమే నిలిచిందన్నారు. వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద రంగం చేనేత రంగమేనని తెలిపారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు చేనేత కుటుంబానికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, ఏటా కుటుంబానికి రూ.25వేలు సాయాన్ని అమలు చేయాలని, చేనేత ఉత్పత్తులపై ఉన్న 5శాతం జీఎస్‌టీ తొలగించాలని పలువురు కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నందము అబద్ధయ్య, చేనేత కులాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ పంపన రామకృష్ణ, ఆప్కో మాజీ డైరెక్టర్ కాశిన ప్రసాదరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చింతా వీరభద్రేశ్వరరావు, సంతబొమ్మాళి పీఏసీఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



# కళాపీఠం కృషి అందరికీ ఆదర్శం

## - సుడా చైర్మన్ కొరికాన రవికుమార్

**హిరమండలం, జనవరి 21(వార్త) :** కళలు సమాజానికి ప్రతిబింభాలని, వాటిని కాపాడుకోవడం మన అందరి భాధ్యతని, కళాపీఠం చేస్తున్న కృషి అందరికీ ఆదర్శమని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని అన్నారు. హిరమండలం సుభలయ కాలనీ, మార్కెట్ కమిటీ హాల్ నందు చీమకుర్తి నాగేశ్వరరావు కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరాణిక పద్య నాటక పోటీల్లో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ముందుగా చీమకుర్తి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అంతరించి పోతున్న నాటక రంగాన్ని బతికించేందుకు చీమకుర్తి నాగేశ్వరరావు కళా పీఠం చేస్తున్న నాటక పోటీలు అందరికీ ఆదర్శమన్నారు. కళాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ వేదికలు కల్పించడం అభినందనీయమని కొనియాడారు. చీమకుర్తి కళా పీఠం అధ్యక్షులు లింగమూర్తి మాట్లాడుతూ ఈ పాతపట్నం నియోజకవర్గంలో కొరికాన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. సుడా చైర్మన్ రవికుమార్, జనసేన నాయకురాలు భవాని ఆధ్వర్యంలో మాలాంటి కళాపీఠం గ్రూపు సభ్యులకు వారికి తోచిన సహాయ సహకారాలు అందజేసినందుకు వారికి అభినందనలు తెలిపారు. అనంతరం రవికుమార్ భవానిలను ఘనంగా కళాపీఠం సభ్యులు పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి రామకృష్ణ, చీమకుర్తి కళాపీఠం అధ్యక్షులు ఎ.లింగమూర్తి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్ లు, నాటక బృంద కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆదిత్యునికి వెండిపల్లెం వితరణ

**అరసవల్లి, జనవరి 21 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని హైదరాబాద్ వాస్తవ్యులు పెమ్మరాజు ప్రసాద్, సుజాత, నాగేశ్వరరావు, నాగదుర్గ దర్శించుకున్నారు. అనంతరం 714.8 గ్రాముల వెండి పళ్లెంను ఆలయ కార్య నిర్వహణాధికారి ప్రసాద్‌కు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక





# రేపటి నుంచే గ్రామీణ పోటీల సందడి

**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):**అరసవల్లి క్షేత్రంలో రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రం క్రీడా వేదికగా మారనుంది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద గల ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలను అట్టహాసంగా నిర్వహించనున్నారు. తొలిరోజున రాష్ట్ర స్థాయి ఆహ్వాన కబడ్డీ పోటీలను ప్రారంభించనున్నారు. వివిధ జిల్లాల నుంచి జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. శనివారం కబడ్డీ ఫైనల్స్?తో పాటు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే వెయిట్ లిఫ్టింగ్, కర్రసాము, సంగీడులు, ఉలవబస్తాల మోత వంటి ఆసక్తికరమైన పోటీలు జరగనున్నాయి. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు భారీగా నగదు బహుమతులు అందించనున్నారు. కబడ్డీ విజేతలకు రూ. 50 వేలు, రన్నరప్‌కు రూ. 30 వేల నగదు పురస్కారం అందజేస్తారు. అలాగే వెయిట్ లిఫ్టింగ్, కర్రసాము తదితర గ్రామీణ క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ. 5 వేల చొప్పున బహుమతులు ఇవ్వనున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో మొత్తం రూ. 1.95 లక్షల ప్రైజ్ మనీని పంపిణీ చేయనున్నారు. ఉదయం 9 గంటల నుంచే పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో క్రీడాభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్రీడాకారులను ఉత్సాహపరచాలని అధికారులు కోరారు.


# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

*** ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చిన తర్వాతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతా * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

*** నందిగాం మండలంలో రూ.1.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**




**నందిగాం/టెక్కలి, జనవరి21(వార్త):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం టెక్కలి నియోజకవర్గంలోని నందిగాం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి, సుమారు రూ.1.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మార్పు కనిపిస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.600 కోట్లతో బృహత్తర పథకాన్ని అమలు చేస్తున్నామని, దీనికి తొలి విడతగా రూ.100 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గొట్టా బ్యారేజీ నుంచి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చిన తర్వాతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నందిగాం మండలంలోని కణితివూరు గ్రామం నుంచి కృష్ణరాయపురం మీదుగా హరిదాసుపురం వరకు రూ.1 కోటి 37 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే స్వామిపేట గ్రామం వరకు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు.అదేవిధంగా ఎస్సీ కాలనీలో రూ.12.50 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, నందిగాం గ్రామంలో శివాలయం వరకు రూ.12.50 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని కూడా మంత్రి ప్రారంభించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల హామీ ప్రకారం నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడినప్పటికీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రజల తరపున, తన తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందుకోసం మొత్తం రూ.600 కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పథకానికి తొలి విడతగా ఇప్పటికే రూ.100 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం అనే మాటే కనిపించలేదని మంత్రి విమర్శించారు. అన్ని శాఖల్లో అప్పులు, కేసులు తప్ప మరేమీ లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని ఆయన అన్నారు. రైతుల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై పశుదాణా పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పశుపోషక రైతులపై ఆర్థిక భారం తగ్గించి పశుపోషణను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

## దామోదర్ నేత్రదానం.. మహోన్నతం



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అదృష్టాన్ని కల్పించవచ్చని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. జిల్లాలోని మంగువారితోటకు చెందిన సాలిహుండం దామోదర్ పట్నాయక్ (44) మృతి చెందగా, వారి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ప్రతినిధులు.. దామోదర్ కార్నియాలను సేకరించి, విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ ఐ బ్యాంక్‌కు అందజేశారు. ఈ బృహత్తర కార్యంలో భాగస్వాములైన మృతుని భార్య షర్మిల, కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, ఆసక్తి ఉన్నవారు 78426 99321 నంబరును సంప్రదించాలని కోరారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

*** జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** సమాజంలో స్త్రీ, పురుష సమానత్వం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పి సి పి ఎన్ డి టి యాక్ట్ అమలుపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో లింగ నిష్పత్తిని మెరుగుపరచడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. స్కానింగ్ సెంటర్లు కేవలం వైద్య అవసరాలకే పరిమితం కావాలని, లింగ నిర్ధారణకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు తనిఖీ నివేదికలను సమర్పించాలని పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్ల యజమానులు ఫామ్-ఎఫ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, రికార్డుల నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి ఆసుపత్రి, స్కానింగ్ సెంటర్?లో ఈ చట్టం గురించిన సమాచారాన్ని ప్రదర్శించాలని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి అనిత, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మేరీ కేథరిన్ న్, డి సి హెచ్ ఎస్ కళ్యాణ బాబు, ఎన్‌జిఒ మంత్రి వెంకటస్వామి, వివిధ పిహెచ్ సి ల వైద్యాధికారులు, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

## ఆకాశ వీధిలో విహారం
## టిక్కెట్ ధర రూ.799



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** సిక్కోలు రథసప్తమి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం పర్యాటకుల కోసం సరికొత్త వినోదాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. నగరంలోని 80 అడుగుల రోడ్డు వేదికగా 'హాట్ ఎయిర్ బెలూన్' ప్రయాణాన్ని ప్రారంభించారు. అరకు చెందిన మెగా ఈగల్ ఫ్లై సంస్థ ఆధ్వర్యంలో ఈ విహార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండు హాట్ ఎయిర్ బెలూన్‌లో ఎనిమిది మంది విహరించేలా ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి ఒక్కొక్కరికి టికెట్ ధరగా రూ.799 లు నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ బెలూన్ విహారం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా అక్కడ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్ సౌకర్యాలను సిద్ధంగా ఉంచారు. భూమి నుంచి 200 అడుగుల ఎత్తున ఆకాశం నుంచి అరసవల్లి ఆలయ శోభను, నగర అందాలను వీక్షించేందుకు నగరవాసులు, భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

# ఆదిత్యుని దర్శనం.. ఇక సులభతరం!


*** సామాన్య భక్తులకు పెద్దపీట.. అరగంటలోనే దర్శనం * శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్**



**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):** సూర్య భగవానుని జన్మదినోత్సవమైన రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని అరసవల్లి క్షేత్రం ప్రాంగణంలో స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ పత్రిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరసవెల్లి సూర్యనారాయణ స్వామివారి వేడుకలను ఏడు రోజులపాటు నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారనీ, తదుపరి కొన్ని అవాంఛనీయ సంఘటనలు వలన మూడు రోజులు పండుగ జరుపుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ వారికి అరగంటలోనే స్వామి వారి దర్శనాన్ని కల్పించుటకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు స్వామివారి దర్శనం క్యూలైన్లలో భారంగా మారకుండా, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక శ్రద్ధతో తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రద్దీని క్రమబద్ధీకరించేందుకు మొత్తం ఆరు సెక్టార్లుగా ఆలయ పరిసరాలను విభజించి గతంలో గంటల తరబడి వేచి చూసే పరిస్థితిని మార్చుతూ, గుడి లోపలి వరకు ఆరు వరుసల క్యూలైన్లను నిర్మించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. మామిడి తోట జంక్షన్ నుండి అసిరితల్లి ఆలయం మీదుగా వెళ్లే మార్గం. ఇక్కడ రూ. 100, ఉచిత క్యూ లైన్లు ఉంటాయని ఇంద్ర పుష్కరిణి ప్రాంతం ఇక్కడ ఉచిత దర్శనం, రూ. 100 భక్తుల కోసం వెయిటింగ్ కంపార్ట్‌మెంట్లు, బొంపడ వీధి నుండి వైకుంఠ ద్వారం (ఉత్తర ద్వారం) వరకు ఉండే వి.ఐ.పి ఎంట్రీ మార్గం. దీన్నే ఈసారి కొత్తగా ప్రతిపాదించామని, ఫలితంగా ప్రజా ప్రతినిధులకు, సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని, వీఐపీలు దర్శనం అనంతరం గుడి వెనకనుంచి తిరిగి అదే ద్వారం గుండా బయటికి వస్తారన్నారు. ప్రధాన ఆలయ లోపలి భాగం అన్ని లైన్లు వేరువేరుగా ఇక్కడే కలుస్తాయని ఇక్కడ భక్తులు వేరువేరుగా, స్వామివారిని సులువుగా దర్శించుకునేలా వేదికలను ఎత్తుల వారీగా సిద్ధం చేయుట జరిగిందని అన్నారు. ఆరు వరుసల్లో వేరువేరుగా సులువుగా దర్శనం కల్పించేందుకు అడుగు, రెండు, మూడు అడుగులు చొప్పున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దర్శనం తర్వాత భక్తులు బయటకు వెళ్లే మార్గంలో అక్కడ ప్రసాద కౌంటర్లు, చెప్పుల స్టాండ్లు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. గతంలో ఒక దాత (డోనార్) పాస్‌తో నలుగురిని అనుమతించే పద్ధతిని తీసేసి, ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత పాస్ ఇవ్వడం ద్వారా పారదర్శకత పెంచామని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌక్యం కలగకుండా వారికి త్రాగునీరు, ఉచిత ప్రసాదాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆలయ పరిసరాల్లో చిన్న అపశ్రుతి కూడా చోటు చేసుకోకుండా 257 సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని ఆలయం పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలంకరణ చేశామని ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. వీటిని పర్యవేక్షించేందుకు ఆలయం పక్కనే ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, నగరం వెలుపల నుంచే భక్తుల ప్రవాహాన్ని ట్రాక్ చేసేలా ట్రాఫిక్ కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. వాహనాల రద్దీని నివారించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో వి.ఐ.పి వాహనాలు సింహద్వారం వరకు వెళ్లి తిరిగి అదే దారిలో వెనక్కి వచ్చేవని ఈసారి వాటిని అసిరితల్లి ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా లక్ష్మీ నగర్ మీదుగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం రోడ్డులోకి బయటకు పంపేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. సాధారణ ప్రజల వాహనాల కోసం 80 ఫీట్ల రోడ్డు (సెక్టార్ 9) వద్ద విశాలమైన పార్కింగ్ కల్పించుట జరిగిందని, దర్శనం ముగిసిన తర్వాత ప్రతీ భక్తుడు బ్రాహ్మణ వీధి (సెక్టార్ 5) గుండా బయటకు వస్తారని, రథసప్తమి రోజున సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంతకు మించి భక్తులు వచ్చినప్పటికీ తగిన ఏర్పాట్లు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. భక్తులెవరూ తొందరపడకుండా, యంత్రాంగానికి సహకరించి ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. పాలకొండ రోడ్డు నుండి ఆమదాలవలస రైల్వే స్టేషన్ వరకు గల రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేశామన్నారు. రోడ్డు విస్తరణకు విడతలవారీగా ఇప్పటి వరకు 24 కోట్ల రూపాయలు కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని మునిసిపల్ శాఖ మాత్యులు పి. నారాయణ రెండు కోట్ల రూపాయలను ఇచ్చినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థము ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర నుండి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు, వృద్ధులకు ప్రోటోకాల్ వెహికల్స్ నాలుగు పెట్టినట్లు తెలిపారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఎటువంటి పొరపాట్లు జరగకుండా జిల్లా యంత్రాంగం ద్వారా అన్ని శాఖల సమన్వయంతో తగిన చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.


## 'గుండ' కుటుంబానికి
## హోంమంత్రి పరామర్శ

**శ్రీకాకుళం, జనవరి 21 (వార్త):** మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని, వారి తనయులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అప్పల సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అప్పలసూర్యనారాయణ ఎనలేని సేవలు అందించారన్నారు. అలాగే జిల్లా బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు అరసవల్లిలోని గుండ అప్పల సూర్యనారాయణ ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, వారి కుమారులను పరామర్శించి ఓదార్చారు. అప్పలసూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంతాపం తెలిపిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, న్యాయవాదులు ఎన్ని సూర్యారావు, కొమ్ము రమణమూర్తి, బీవీ రమణ, వాన కృష్ణచంద్, బీన ఢిల్లీశ్వరరావు, ఖాన్ తదితరులు ఉన్నారు. జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌లో గుండ అప్పలసూర్యనారాయణ చిత్రపటానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదర్ మాట్లాడుతూ కోర్టు ప్రాంగణంలో మౌలిక సదుపాయాల కల్పనకు అప్పల సూర్యనారాయణ ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, వాన కృష్ణచంద్, వై.మురళీమోహన్ రావు, నౌపడా విజయ్ కుమార్, గేదెల వాసుదేవరావు, కిల్లి మార్కండేయులు, డి.పార్థసారధి, పేరూరి నాగేశ్వర రావు, కింజరాపు శ్రీనివాసరావు, మామిడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



# అలరించిన 'శ్రీరామరాజ్యం' నాటక ప్రదర్శన

**శ్రీకాకుళం, జనవరి 21(వార్త):**నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ప్రదర్శించిన 'శ్రీరామరాజ్యం' పౌరాణిక నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. రథసప్తమి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ వినాయక నాట్య మండలి (సురభి) వారి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. సురభి నాటక సంస్థకు ఉన్న సుదీర్ఘ చరిత్రకు అద్దం పడుతూ, కళాకారులు తమ అభినయంతో పాత్రలకు ప్రాణప్రతిష్ట చేశారు. ముఖ్యంగా శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణ, భరత, శత్రుఘ్న పాత్రధారులు తమ ఆహార్యం, వాచికంతో సభికులను మంత్రముగ్ధులను చేశారు. రామరాజ్య స్థాపన, ధర్మ రక్షణ వంటి అంశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ నాటకానికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆర్.వేణుగోపాలరావు దర్శకత్వం వహించారు. పౌరాణిక నాటక రంగంలో ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు. రంగురంగుల సెట్టింగులు, సురభి సంస్థకే ప్రత్యేక మైన మాయాజాలం ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాయి. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక రంగ ప్రముఖులు, కళాకారులు పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546